# శిరముపాటు

శ్రీ సుభా

చలమయ్యకి పెళ్లి అయిన వెంటనే మామ గారు బ్రతిమలాడుతూ అన్నాడు.... "మా పార్వతికంటే నువ్వు తక్కువ చదువు కున్నోడివని అది నిన్నేం ఖాయిలా చేయదు....కానీ యెదవది, యీ రోజుల్లో డిగ్రీ కాయితం చేత నేకపోతే మడిసికి విలువలేదు....అదోటి సంపాదించు యెట్టాగయినా కిందా మీదాపడి" అని....

ఆ తర్వాత దగ్గర వాడూ, కావల్సిన వాడూ దొడ్డిదారిన వుద్యోగం యిచ్చిన వాడూ కాబట్టి ఆఫీసరు కూడా అలాగే చెప్పాడు.

"మీ అన్నయ్య మాట కాదనలేక నీకు పెద్ద వుద్యోగమే యిచ్చాను. నిజం చెప్పాలంటే ఇంజినీరింగ్ డిగ్రీ వుంటేనే గానీ యీ పోస్ట్ యివ్వకూడదు........ అదృష్ట జాతకుడివి....ఎందుకైనా మంచిది చదువుకో.



రోజులు ఒక లాగే వుండవు తెలివైన వాళ్లూ, చదువుకున్న వాళ్లూ రాజ్యమేలే రోజులువస్తే, మనలాంటి వాళ్లకి మంచినీళ్లమాట అటుంచి మర్యాద కూడా దక్కకపోవచ్చు ఏదో రాత్రి కాలేజీలో జేరు ఒడ్డునపడు " చలమయ్యకి యివన్నీ తెలియని విషయాలేం కావు. చదువు సరిగ్గా అబ్బలేదుగానీ బుర్రలు యిస్తే మార్చేయగల రకం. దేశంలో లా, పోలీసుల భయం లేకపోతే యింకా యేమన్నా చేయగలడు కూడా.

అతనికున్న ధైర్యంతో స్కూల్లో మేష్టర్లని ఆడించేశాడు. పదిహేడేళ్లు రాకుండానే పార్వతి వెంటబడి, తరిమి, ప్రేమించేసి ఆమెకు తను తప్ప మరొకడు ఆ జిల్లాలో దొరకడన్నంతగా నటించాడు

ఆ విధంగా చలమయ్య పదెకరాల ఆస్తివున్న పార్వతికి భర్త అయి - ఆ వెంటనే ఆంధ్ర దేశంలో ఒకానొక ఫ్యాక్టరీలో నాలుగేళ్లు తర్ఫీదు అయినట్లు చిన్న కాగితం పుట్టించుకుని నాలుగు వందల రూపాయల వుద్యోగస్తుడయ్యాడు

చలమయ్య అదృష్టాన్ని చూసి కొందరు ఏడ్చారు. మరి కొందరు అతని ధైర్యాన్ని చూసి ముక్కుమీద వేలేసుకున్నారు వీళ్లెవర్నీ అతను లెఖ్ఖ చేయలేదు

కానీ పార్వతి అతనికీ మధ్య పక్కలో పెళ్లాంకాకుండా బల్లెం అవసాగింది

"మీరు చప్పున బి ఇ. అవండి లేకపోతే నేను పుట్టింటికి పోతా" అనేసింది.

"ఎందుకుట బి. ఇ. గాడు యింత కన్నా ఘనంగా కాపరం చేస్తాడా యెక్కువ సంపాదిస్తాడా నాయాల." అన్నాడు చలమయ్య పార్వతి బుగ్గ గిల్లి...

"అందరూ మీగురించే మాట్లాడుకుంటున్నారు దొంగ సర్టిఫికెట్లతో మీకీ వుద్యోగం దావగారిప్పించారని చెప్పుకుని నవ్వుకుంటున్నారు " పార్వతి పైకి అనలేదుగాని భర్త తెలివితేటలమీద - విద్యార్హతలమీద ఆమెకే నమ్మకంలేదు.. స్కూల్ఫైనల్ పాసయిన తనముందే తప్పుడు యింగ్లీషు మాట్లాడే భర్త - హిందూ పేపర్ లైఫూ చదువుకుంటూ బజార్న నడుస్తూంటే - పార్వతికి తల కొట్టేసినట్టుగానే వుండేది. కళ్లు మూసుకుని పాలుతాగే పిల్లి కన్పించినప్పుడల్లా ఆ పిల్లి మొహంలో భర్త చలమయ్య కన్పించేవాడు పార్వతికి

"యేం యీ సారయినా పరీక్ష ఫీజు కడతారా లేదా" చలమయ్య పదిమంది ముందు చెప్పుకోలేడు గానీ - అతనికీ ఆత్మవుంది రోజులో యేదో క్షణంలో ఆ ఆత్మ వెక్కిరిస్తూనే వుంది ఒంటిగా కూర్చున్నా - నలుగురు చదువుకున్న వాళ్ల ముందు నటించాలన్నా బాధగానే వుంది. .

అందుకే చలమయ్య పరీక్షకి కట్టాడు. పార్వతి వీరపత్నిలా సంతోషించింది.

* * *

మామగారు పంపించిన విశ్వనాథాన్ని చూసి చలమయ్య ఆశ్చర్యపోయాడు గెడ్డం పెరిగి గెడకర్రలా వున్నాడు — విశ్వనాధం. మొహం పీక్కుపోయి